# చంద్రుని భూలోకం

"ఎలా వచ్చిందో వచ్చింది! అదంతా నీకెందుకయ్యా? పడితే తీసుకో లేక పోతే ఇలా ఇచ్చెయ్!" అన్నాడు. సోము, తీసుకున్న సిగరెట్ పెట్టె తిరిగి ఇచ్చేస్తూ, విసుగ్గా.

ఐదురూపాయల కాయితానికేసి చూస్తూ కిల్లీదుకాణం వాడన్నాడు, "ఔను బాబూ! నాకెందుకు? ఎలాగో మార్చెయ్యాలని మీ తిప్పలు; పనికపోతే నష్టపడాలే అని మా ఏడుపు!...పోనీ, ఓ అర్థరూపాయి రాయితీ చేస్తే కష్టమో నష్టమో ఉంచేసుకుంటాను."

"ఆ! అర్థరూపాయి కమీషన్ కావాలా ఇది మార్చటానికి! ఏదో కొత్త రంగం టిందో లేదో ఇంత హంగామా ఏమిటి?" చూస్తూ చూస్తూ వృథాగా అర్థరూపాయి వదులుకోడమా? నోటుమడిచి జేబులో పెట్టుకుని ఇంటిముఖం పట్టాడు, సోము.

*   *   *

"ఒరే కిష్టూ! ఇంట్లో కందిపప్పు ఐపోయింది తేవాలని చెప్పు." వంటింట్లో నుంచీ ఇల్లాలు నోటేసిసోంది

ఇంకోప్పుడైతే, "ఔనౌను! కందిపప్పు కేంపనుంది? చూస్తూ చూస్తూ తిరిగిపోతూం టుంది. మళ్ళీ తెమ్మంటుంది. ." అంటూ పొదుపుమీద, గుణపాఠాలు చెప్పే సోము, ఇవాళమాత్రం ప్రసన్న వదనంతో కిష్టూ చేతికి డబ్బిచ్చి పంపాడు. పప్పుతోపాటు ఒక ణా పటిక బెల్లం కూడ తీసుకుని పావు గంటకల్లా పునః ప్రత్యక్షమైనాడు కిష్టూ. సోమూ ఆశ్చర్యానికి మేరలేదు. "అరె! డబ్బిచ్చి తెచ్చావురా! ఎక్కడిది?"

"అదేంటి నాన్నగారూ! వీరేగా ఐదురూపాయల నోటిచ్చారు!" సోమూ మరి మాట్లాడలేదు "పనదంటూ తిరిగివస్తా డనుకున్నాను. వీడి తప్పదియ్యా, మార్చు కునే వచ్చాడు, అసాధ్యుడు! పోనీ, పీడ వదిలిపోయింది." అనుకున్నాడు. కిష్టూకి బిళ్ళలు కొనుక్కోమని మరోబేడ బహుమానం కూడా ఇచ్చాడు ఎవడో దుకాణదారుడి ముఖాన అర్థరూపాయి తగలేసిం దానికంటె ఇది నయంకదా! కాని పప్పుకి అనవసరంగా రూపాయి తగలేశానే, ఒక అర్థరూపాయిది తెమ్మంటే సరిపోయేది అని పించింది. మొత్తానికి ఆ రాత్రి సోమూ హాయిగా నిద్రపోయాడు.

మర్నాడు బజారునించీ వస్తూ, కాఫీ పొడి, చక్కెరకోసం దుకాణానికి పోయాడు. దుకాణదారుడు పదిరూపాయల నోటు తీసుకుని చిల్లర ఇచ్చాడు. సోమూ తెల్లపోయాడు. ఆ మిగత చిల్లరలో తన ఐదురూపాయలనోటే తిరిగి ప్రత్యక్షమైంది.


## తెన్నేటి అహల్యాదేవి

ఏమనటానికీ తోచలేదు. కొంచెం తమాయించుకుని అడిగాడు, "ఏం,సూరయ్యా? ఇలాంటి నోటిచ్చావు? పడదల్లేవుందే!" సూరయ్య చెప్పాడు, "అదేమిటి బాబూ!– మీరిచ్చిందేగాదూ! నిన్న మన అబ్బాయి వస్తే ఏదో తొందర్లోవుండి తీసుకున్నాను. అయినా మన్లోమనకేమిటి? పోతేసరి, లేక పోతే అప్పుడే ఇచ్చెయ్యొచ్చని జ్ఞాపకంగా దగ్గర పెట్టుకున్నాను."

స్వగతంగా చచ్చేన్రా దేవుడా అనుకుంటు, ప్రకాశంగా, "అలాగా! నేనూ చూసుకో లేదు సూరయ్యా! పోన్లే, నీవెందుకు నష్ట పడాలి?..." అన్నాడు సోము. ఫలితమేమిటంటే, ఆపదలో సైతం అంటిపెట్టుకునే స్నేహితుడిలా గుండెకి దగ్గరగా జేబులో మళ్ళీ తిష్ఠవేసింది, సోము సంపాయించిన ఐదురూపాయల నోటు.

తరువాతకూడా ఎన్నో ప్రయత్నాలూ పరాజయాలు ఇలానే తటస్థించాయి. చివరకు సోమూ నిశ్చయించుకున్నాడు, ఈ తద్దినం వదిలించుకోవాలంటే ఏదో దగాలాంటిది చెయ్యక తప్పదని.

నిశ్చయించి తలఎత్తేసరికి ఎదురుగా మొట్టమొదట కంటపడ్డవస్తువు, ఒక సైన్‌బోర్డు, 'చంద్రశేఖర కాఫీవిలాస్' శుభం అంటూ లోపలజొరబడ్డాడు. అసాధారణంగా తొమ్మిదణాలు బిల్లుచేసి నోటు అయ్యర్ ముందు



వింత వింత పూలు పూసే కాకర పువ్వొత్తి

—ఫోటో: ఎస్. రామకృష్ణ.]

# ★ గుండ్రని భూలోకం ★

పెట్టాడు. అంత సందడిలో కూడా ఆ చతుర్నేత్రుడి కళ్ళు పడనేపడినై.

"ఏం, సామీ! ఇది పడదుకదా!"

తెగించి అన్నాడు సోమూ, "అరె! ఏం? ...నా దగ్గర వేరే చిల్లరలేదే మరి!" ఈ దెబ్బతో సరే, ఏంచేస్తాం, ఇయ్యండి అంటాడని ఆశ! అయ్యర్ పరకాయించి చూశాడు, అన్నాడు, "పోనీ సామీ! ఎక్కడపోతుంది? రేపే ఇద్దరుగాని... ఎవడో తుంటరి ఎగేస్తాడుగాని మీ విషయంలో ఏం భయం?" రోజు ఆ హోటలు ముందునించే సోమూ ఆఫీసుకు పోతుంటాడు. నోటు పోకపోయినా నలుగురూ చుట్టూమూగారు "ఏదండిసార్!" అంటూ ప్రతివాడి చేతులోకి పోయింది. "ఎవడో తోసేసి ఉంటాడు, పాపం!", "ఎవరిచ్చారో జ్ఞాపకం లేదాండి?" "అసలు దీనికీ రంగెలా అంటిందో!" ఈ ప్రశ్నలన్నీ వదలించుకుని ఓ అరగంటకి ఇవతల పడ్డాడు.

నిరాశపడి కొన్నాళ్లు ఊరుకున్నాడు సోమూ. ఒకనాడు మళ్లీ, ఆ మొదటి దుకాణం వాడికే అర్ధరూపాయి కమిషనిచ్చి వదలించుకోడం ఉచితమని నిశ్చయం కలిగి బయలుదేరాడు. దారిలో ఒక స్నేహితుడు కనపడి మొదటిఆట సినిమాకు లాక్కుపోయాడు. మాటల సందర్భంలో నోటుసంగతి వచ్చి స్నేహితుడు అడిగాడు. "అసలెలా వచ్చిందోయ్ ఆ నోటు?" సోమూ చెప్పాడు, "అది ఎక్కణ్ణించో రాలేదోయ్! చౌకగావుందని ఒక జేబురుమాలు కొన్నాను రంగుపూలతో అందంగా కనిపిస్తే. దారిలో జోరున వాన మొదలైంది. ఇంటికొచ్చేసరికి, తడిరుమాలుమీది రంగుపూలన్నీ నోటుమీది కెక్కినై...ఇదీ కథ".

"అరె! ఇంతేనా? దీనికేనా ఇంత తిప్పలు పడుతున్నావు? తడిసి అంటినరంగు మళ్లీ తడిపితే పోదుటోయ్!.....కొంచెం బుర్ర ఉపయోగించితే బావుండేది బ్రదర్..." అన్నాడు స్నేహితుడు వేళాకోళంగా.

బోధివృక్షంక్రింద జ్ఞానోదయమైన బుద్ధుడిలా, వికసించిన ముహంతో, "అవునోయ్! వెధవది ఈ మాత్రం తట్టిందిగాదు...ఓ. కే! ఇప్పుడైనా మించిపోయిందేముంది? ఇదుగో..." అన్నాడు సోమూ జేబులో చెయ్యితడువుతూ. తడివి తడివి చిట్టచెయ్యి బయటికితీసి తెల్లమొహం వేశాడు. స్నేహితుడికంతా అర్థమైంది. బుకింగ్ ఆఫీస్ దగ్గర, బకధ్యానంచేసే ఏ జేబుదొంగ అదృష్టమో ఫలించిందని తెలుసుకున్నాడు. తీరా తరణోపాయం సిద్ధించే ఘడియలో నే అసలుకే మోసంవచ్చిందే అని సోమూ పడ్డ వ్యథ ఇంతింతకాదు. అచ్చంగా, 'సలలితముగ నారికేళ సలిలముభంగిన్' అన్నట్టుగానే వచ్చిందా అయిదురూపాయిలనోటు. 'కరిమింగిన వెలగపండు'లాగా చివరకు పోనేపోయింది. సుమతీశతకకారుడు ఈ పద్యం నా నోటునుగురించే చెప్పివుంటాడు అనుకున్నాడు సోమూ.

మర్నాడుసాయంత్రం ఆఫీసులో ఆలస్యమైంది. ఇంటికివస్తూ, ఇన్ని కాఫీ నీళ్లు తాగుదామని, చంద్రశేఖరవిలాస్‌లో ప్రవేశించాడు. అడుగుపెట్టగానే అయ్యర్ పిలిచాడు, "ఇదోసార్! మధ్యాహ్నం ఎవడో కాఫీతాగి ఈ నోటు ఇచ్చాడు. ఇది పడదు వేరే ఇమ్మంటే, ఇప్పుడే తెస్తానని ఆదేదారి పట్టాడు....నాకు చటుక్కున జ్ఞాపకంవచ్చింది, మీ దగ్గర చూచానని.... ఇదో, చూడండి!" నోటు చేతికి అందిస్తూ అన్నాడు, "కాని...ఆ దొంగవెధవ బిల్లు సార్...ఆ బిల్లు కట్టి మీ నోటు మీరు తీసుకుపోవడం న్యాయంగా వుంటుంది సార్!" సోమూకు ఏమనాలో తెలియలేదు. ఇప్పటికే ఆ నోటు మార్చడానికి ఐదు రూపాయలుపైగా ఖర్చు అయింది. ఐనా చుట్టూ కమ్ముకువస్తున్న ప్రశ్నలను వాడిలిపోయి, 'సరే' అని ఇవతలపడ్డాడు.

★

